సాక్షి సంగారెడ్డి

శనివారం । 17 । మే । 2025



ఆటలాడేటోళ్లం...

బాల్యపు జ్ఞాపకాలు నేటికీ మధురస్మృతులని సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు.

వివరాలు IIలో ▸



నాటారు.. నరికారు

హరితహారంలో నాటిన మొక్కలు విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని యథేచ్ఛగా నరికివేస్తున్నారు.

వివరాలు IIలో ▸



సింగూరు పనుల్లో అవినీతి

సింగూరు కాలువ పనుల్లో భారీ అవినీతి జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు.

వివరాలు IIIలో ▸

ఆ రెండు బల్దియాల్లో యూజీడీలు

- రూ.580 కోట్లతో సంగారెడ్డి, రూ.273 కోట్లతో సదాశివపేటలో
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి ప్రతిపాదనలు
- కలెక్టర్ ద్వారా ఇటీవలే సీడీఎంఏకు డీపీఆర్‌లు



సదాశివపేట పట్టణంలోని మురికి కాలువ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లా కేంద్రం సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ రెండు చోట్ల అస్తవ్యస్తంగా తయారైన డ్రైనేజీ వ్యవస్థకు పరిష్కారమే లక్ష్యంగా ఈ యూజీడీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు సంగారెడ్డి పట్టణంలో ఈ యూజీడీ వ్యవస్థ కోసం రూ.580 కోట్లు అవసరమని, సదాశివపేట మున్సిపాలిటీకి రూ.273 కోట్లు అవసరమని ప్రాథమికంగా తేల్చారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ డీపీఆర్ (డిటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు)లను ఇటీవలే కలెక్టర్ ద్వారా కమిషనర్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు పంపారు. ఈ రెండు పట్టణాల్లో నివసిస్తున్న కుటుంబాల సంఖ్య, జనాభా, వార్డులు, జనసాంద్రత తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనలు తయారు చేశారు.

భారీ నిధులు కేంద్రానికి ప్రతిపాదనలు..

యూజీడీల నిర్మాణానికి భారీగా నిధులు అవసరం ఉంటాయి. దీంతో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఈ నిధులను రాబట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం), అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ స్కీం వంటి పథకాలను అమలు చేస్తోంది. ఈ పథకాల కింద పట్టణాల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేస్తోంది. ఇప్పటికే అమృత్ వంటి పథకాల కింద జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలకు నిధులు మంజూరు చేసింది. ఈ యూజీడీలకు కూడా కేంద్రం నుంచి నిధులు రాబట్టడం ద్వారా పట్టణాలను అభివృద్ధి చేయవచ్చనే యోచనలో ఉన్నారు. ఇప్పటికే ఈ యూజీడీల ప్రతిపాదనలు సీడీఎంఏ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వెళ్లినట్లు సమాచారం.



సంగారెడ్డి పట్టణంలో మురికి కాలువ

యూజీడీ డీపీఆర్‌లు పంపాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంగారెడ్డి మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ డీపీఆర్‌లను జిల్లా కలెక్టర్‌కు పంపాం. పట్టణ జనాభా, కుటుంబాల సంఖ్య, జనసాంద్రత వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఇంజనీరింగ్ విభాగం ఈ డీపీఆర్ తయారు చేశాం. నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

–ప్రసాద్ చౌహాన్,
సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్

ఇవీ ప్రతిపాదనలు..

మున్సిపాలిటీ: సంగారెడ్డి		మున్సిపాలిటీ: సదాశివపేట	
యూజీడీ అంచనా వ్యయం	: రూ.580 కోట్లు	యూజీడీ అంచనా వ్యయం	: రూ.273 కోట్లు
అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పొడవు	: 240 కి.మీ.లు	అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పొడవు	: 148 కి.మీలు.
యూజీడీ జోన్లు	: 6	యూజీడీ జోన్లు	: 4
సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీ)లు	: 5 + 1	సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీ)లు	: 3 + 1
మెయిన్ ఎస్టీపీ సామర్థ్యం	: సుమారు 7 ఎంఎల్‌డీ (మహబూబ్‌సాగర్ వద్ద..)	మెయిన్ ఎస్టీపీ సామర్థ్యం	: 3.5 ఎంఎల్‌డీ (ఊబ చెరువు వద్ద..)
మొత్తం వార్డులు	: 36	మొత్తం వార్డులు	: 26
పట్టణ జనాభా	: 1.20 లక్షలు (సుమారు)	పట్టణ జనాభా	: 55 వేలు (సుమారు)
కుటుంబాల సంఖ్య	: 25 వేలు (సుమారు)	కుటుంబాల సంఖ్య	: 12,400 (సుమారు)

అకాల వర్షాలకు రైతులు నష్టపోకూడదు



పీఏసీఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

కొండాపూర్(సంగారెడ్డి): అకాల వర్షాలతో జిల్లాలో రైతులెవరూ ఇబ్బందులు పడకూడదని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం రవాణాలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకున్నా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలోని తొగర్‌పల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం, జొన్నల కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ సందర్శించి, నిర్వహణపై తీరును పరిశీలించారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, దరఖాస్తుల ప్రక్రియ, విధానాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా, నాణ్యత కోల్పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్‌లు, గన్నీ సంచులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు, ఐకేపీ, శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరలకే కొనుగోలు చేయాలని ఆదేశించారు. కేంద్రాలలో నిల్వ చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. తేమ శాతం కొంచెం ఎక్కువగా వున్నా ధాన్యాన్ని తీసుకోవాలని రైస్ మిల్లర్లకు, డీలర్లకు సూచించారు. ధాన్యం కొనుగోలు అనంతరం రైతుల ఖాతాలలో నేరుగా డబ్బులు జమయ్యేలా ఆన్‌లైన్‌లో ఖాతా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

రెవెన్యూ సేవల్లో పారదర్శకత

భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ అమలులో పారదర్శకత, సమర్థత, వేగం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. భూభారతి గ్రామ సభలలో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భూభారతి ప్రక్రియలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. భూభారతి గ్రామ సభల్లో రైతుల నుంచి దరఖాస్తులు ఉచితంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, పీఏసీఎస్ సిబ్బందితోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు భూభారతిపై సమీక్ష

భూ భారతిపై నిర్వహించిన గ్రామ సభలలో వచ్చిన సమస్యలపై శనివారం సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్షకు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతోపాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి హాజరుకానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.ప్రభు ఓ ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

వైభవంగా రంగనాథస్వామి కల్యాణోత్సవం

హాజరైన మంత్రి దామోదర



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): అందోల్ గ్రామంలోని ప్రాచీన భూనీల సమేత రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు పట్టు వస్త్రాలతో కల్యాణానికి సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, హరికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మండల పరిధిలోని జుక్కల్ తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. జుక్కల్ గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి అర్హులకు ఇళ్లను మంజూరు చేయడంతో ఆయన జుక్కల్ తండాలోని చోటురాంనాయక్, రాములునాయక్, గణపతి, మున్యానాయక్లు నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తమది ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రజా ప్రభుత్వమన్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు 'ఉపాధి పథకం' సామాజిక తనిఖీ

జహీరాబాద్ టౌన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 17న ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మహేందర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 16 తేదీ వరకు నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికను ఆడిటర్లు సమర్పిస్తారని చెప్పారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర బృందం



చిల్కపల్లిలో చిన్నారులతో బృందం సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): సుపోషిత్ గ్రామ పంచాయతీలకు ఎంపిక చేసేందుకు మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. మండల పరిధిలోని పొట్టిపల్లి, చిల్కపల్లి, కృష్ణాపూర్ గ్రామాల్లోని శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, సేవలపై ఆరా తీశారు.

ప్రయాణికులే ఆర్టీసీకి ఆదాయవనరు



ప్రయాణికురాలికి గులాబీపువ్వు అందజేస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ప్రయాణికులే ఆర్టీసీకి ఆదాయ వనరులని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య పేర్కొన్నారు. ఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం మర్యాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులుతో కలిసి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులకు గులాబీపువ్వులతో స్వాగతం పలికి బహుమతులుగా ఆర్టీసీ సంస్థ కీ చైన్లను అందజేశారు.

జిల్లావాసికి ప్రధాని అభినందనలు



ఫ్లైట్ లెఫ్టినెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డితో కరచాలనం చేసి అభినందిస్తున్న ప్రధాని మోదీ

జహీరాబాద్: భారత వైమానిక దళంలో పనిచేస్తున్న సంగారెడ్డి జిల్లావాసి పట్లోళ్ల లక్ష్మీకాంత్‌రెడ్డిని ప్రధాని మోదీ అభినందించారు. కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల లక్ష్మీకాంత్ రెడ్డి నాలుగేళ్ల క్రితం భారత వైమానిక దళంలో చేరి ప్రస్తుతం ఫ్లైట్ లెఫ్టినెంట్ ర్యాంక్ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన అప్రకటిత యుద్ధం నేపథ్యంలో మిగ్ యుద్ధ విమానం, గగనతల రక్షణ వ్యవస్థ సుదర్శనచక్ర ఎస్–400ను ధ్వంసం చేశామని పాక్ చెప్పిన విషయాలు అవాస్తవమని నిరూపించేందుకు ప్రధాని మోదీ పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లి దాని ఎదుటే నిల్చుని ప్రసంగించారు. ఆ సందర్భంలో అక్కడే ఉన్న లక్ష్మీకాంత్‌రెడ్డిని ప్రధాని మోదీతో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా భారత జవాన్లనుద్దేశించి 'మీ మెరుపు వేగం, కచ్చితత్వం శత్రువులను నిశ్చేష్టులను చేసిందని, భారతీయులంతా మీ పోరాటానికి ఉప్పొంగి పోయార'ని ప్రధాని అభినందించారు. ప్రధానితో కరచాలనం చేసి, అభినందనలు పొందడం తమకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని లక్ష్మీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

జహీరాబాద్ నిరుద్యోగులకు..

జహీరాబాద్: సెట్విన్ కార్పొరేషన్ సంస్థ–పుష్కర్ అగ్రోటెక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని సెట్విన్ ప్రాంగణంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జహీరాబాద్ పట్టణం, మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాకు హాజరు కావాలని సూచించారు. కనీస డిగ్రీ అర్హత, బీఎస్సీ అగ్రికల్చర్, డిప్లొమా అగ్రికల్చర్ అర్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందని పేర్కొన్నారు.



పార్కు చుట్టూ పేరుకుపోయిన చెత్త



చెత్తలోనే ఆడుకుంటున్న పిల్లలు

ఆహ్లాదం 'చెత్త'పాలు

పట్టించుకోని అధికారులు

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పదో వార్డు హౌసింగ్ బోర్డులోని పట్టణ ప్రకృతి వనం చెత్తతో నిండిపోయింది. ప్రకృతి వనంలో ఎటు చూసినా ఎండిపోయిన మొక్కలు, చెత్తాచెదారమే దర్శనమిస్తుంది. సెలవులు ఉండటంతో పిల్లలు ఆడుకుంటున్నారు. అయితే పార్కు నిండా చెత్త ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన ప్రకృతి వనం పిల్లలకు కొత్త రోగాలను తెచ్చిపెడుతోంది. ఇలా చెత్తతో నిండి పరిసరాలు పూర్తిగా పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రకృతి వనంలో పరిసరాలు బాగుచేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మోసగిస్తే కఠిన చర్యలే

కొనుగోలు కేంద్రాల తనిఖీల్లో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి



రైతులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ జ్యోతి

జిన్నారం(పటాన్‌చెరు): కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను మోసగిస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, నిర్వాహకుల తీరుపై రైతులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన జిల్లా అధికారుల బృందం శుక్రవారం జిన్నారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా అధికారుల బృందం వద్ద రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. భారీ వర్షాలకు కొనుగోలు కేంద్రాల వద్ద సకాలంలో తూకం వేయకపోవడం వల్లే వర్షాలకు తమ ధాన్యం తడిసిముద్దయిందని రైతులు వాపోయారు. టోకెన్ ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్లు తూకం వేస్తున్నారని ఈ వ్యవహారంలో వీవోఏ భర్త పెత్తనం చలాయిస్తున్నాడని రైతులు ఫిర్యాదు చేశారు. తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తనిఖీ చేపట్టి క్వింటాలుకు 4 కిలోల చొప్పన తూకంలో మోసాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారించారు. దీంతో తూకం యంత్రాలను సీజ్ చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి, కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు అనిల్ తెలిపారు. ఇప్పటికే తూకంలో మోసపోయిన రైతులకు పరిహారం అందించేలా కృషి చేస్తున్నామన్నారు. స్థానిక ఏపీఎం, వీవోఏలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నరేందర్, ఏఈఓ అజారుద్దీన్ వీవోఏ లత పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్

గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పరమేశం తనిఖీ చేశారు. నల్లవల్లి కేంద్రంలో హమాలీల కొరతను రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా...కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలను పెంచాలని నిర్వాహకులకు సూచించారు.

పలువురు తహసీల్దార్ల బదిలీ

జిల్లాకు నలుగురు రాక


సంగారెడ్డి జోన్: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తహసీల్దార్ల బదిలీల్లో జిల్లాలోని పలువురు అధికారులు బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు ముగ్గురు తహసీల్దార్లు బదిలీ కాగా, ఇతర జిల్లాల నుంచి నలుగురు సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

అధికారి పేరు	ప్రస్తుత జిల్లా	బదిలీ అయిన జిల్లా
భిక్షపతి	సంగారెడ్డి	హైదరాబాద్
బాలశంకర్	సంగారెడ్డి	హైదరాబాద్
వెంకటస్వామి	సంగారెడ్డి	వికారాబాద్
సదానందం	హైదరాబాద్	సంగారెడ్డి
బి.జయరాం	వికారాబాద్	సంగారెడ్డి
ఎస్.సంధ్య	వికారాబాద్	సంగారెడ్డి
వెంకటేశ్	వికారాబాద్	సంగారెడ్డి

సెర్ప్‌లో స్థానచలనాలు

2015 ఏడాది తర్వాత ప్రక్రియ

- రాష్ట్ర అధికారులకు జిల్లా ఉద్యోగుల వివరాలు
- జిల్లాలో 192 మంది ఉద్యోగులు
- ఈ నెలాఖరుకు పూర్తి కానున్న బదిలీలు



సంగారెడ్డి జోన్: జిల్లాలో సెర్ప్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు సంబంధిత శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో సెర్ప్ ఉద్యోగులతోపాటు ఉపాధి హామీ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి చర్యలు ప్రారంభించింది. దీంతో కొన్నేళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న అధికారులు బదిలీ కానున్నారు. అదేవిధంగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న వారికి ఊరట కలగనుంది. అన్ని రకాల ఉద్యోగులకు బదిలీలు చేపట్టేందుకు అవకాశం కల్పించింది. త్వరలోనే బదిలీలకు సంబంధించిన జీఓ జారీచేయనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు.

పదేళ్ల అనంతరం బదిలీలు

సెర్ప్ ఉద్యోగులకు 2015 సంవత్సరం తర్వాత పూర్తిస్థాయి బదిలీల ప్రక్రియ చేపడుతున్నారు. వాస్తవానికి 2018లో కొంతమేర బదిలీ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయారు. సుమారు పదేళ్ల అనంతరం ఎట్టకేలకు ఉద్యోగుల బదిలీ ప్రక్రియను ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా ఈ విభాగంలో 192మంది అధికారులు వివిధ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 40మంది ఉద్యోగులు జిల్లా కేంద్రం కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా, 151 మంది మండలస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక ఉద్యోగి డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా ఒకే దగ్గర విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలోని సెర్ప్ ఉద్యోగుల వివరాలు

ఉద్యోగి స్థాయి	జిల్లా కేంద్రంలో అధికారులు	మండల స్థాయిలో
అదనపు డీఆర్‌డీఓ	1	0
డీపీయం	4	0
ఏపీయం	7	24
కమ్యూనిటీ కోఆర్డినేటర్స్	16	127
సపోర్టింగ్ స్టాఫ్	12	0

జిల్లా వివరాలు రాష్ట్ర ఉద్యోగులకు నివేదిక

బదిలీ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని వివిధ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలను రాష్ట్రస్థాయి ఉద్యోగులకు నివేదిక పంపనున్నారు. ఉద్యోగులలో పేరు మార్పులు, తప్పులు ఉంటే వాటి వివరాలు సైతం ఫిర్యాదు రూపంలో స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విధివిధానాలతో కూడిన జీఓ జారీ కాగానే నియమ నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. కొన్నేళ్లుగా ఉద్యోగులు బదిలీల ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉద్యోగుల బదిలీ ప్రక్రియకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈనెలాఖరుకు బదిలీల ప్రక్రియ పూర్తి కానున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే వాటిని అనుసరించి కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టనున్నారు. ఇక జిల్లాలో ఏర్పడిన మండలాలకు సైతం అధికారులను నియమిస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటతోపాటు వడియారం గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. నాలుగు రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. రికార్డుల్లోని స్టాక్ లెక్కలు దుకాణంలో ఉన్న స్టాకుతో సరిగా ఉన్నాయా లేదా అని చూసారు. ఈ సందర్భంగా డీలర్లు కొన్ని దొడ్డు బియ్యం బస్తాలు వస్తున్నాయని, తూకంలో తరుగు వస్తుందని అధికారులకు తెలిపారు. గోదాంలలో తూకం వేసుకొని నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని అధికారులు సూచించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

తూప్రాన్: పెళ్లి అయిన 30 ఏళ్ల తర్వాత అదనపు కట్నం వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యాదగిరి వివరాల ప్రకారం... మండలంలోని మాల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటోళ్ల బాలమణి, కిష్టయ్యలకు 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా కిష్టయ్య రెండేళ్లుగా మద్యానికి బానిసై నిత్యం వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని రంజోల్‌లో చోటు చేసుకుంది. తయాబ్ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగకు కరెంట్ సరఫరా అవుతోంది. అటుగా వెళ్లిన ఎద్దులకు సపోర్టు తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. సపోర్టు తీగకు కరెంట్ సరఫరా అవుతుందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఫంక్షన్ హాల్‌కు ప్రజలు వస్తుంటారని, ఎవరైనా సపోర్టు తీగకు తాకితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

గుండారంలో జింక సంచారం

– అటవీ అధికారులకు అప్పగించిన గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గుర్రాల శ్రీధర్‌రెడ్డి మామిడి తోటలో శుక్రవారం జింక స్వల్ప గాయాలతో అస్వస్థతకు గురై కనిపించింది. ఎండ వేడికి తట్టుకోలేక దప్పికై తోటలోకి నీటి కోసం వచ్చి ఉంటుందని పేర్కొన్నారు. గమనించిన శ్రీధర్‌రెడ్డి స్థానికులతో కలిసి ఫారెస్ట్ బీట్ అధికారులకు సమాచారమిచ్చారు. గ్రామానికి వచ్చిన బీట్ ఆఫీసర్ శ్రవణ్‌రెడ్డి, టీఏ నరేష్‌లకు జింకను అప్పగించారు. మాజీ ఉపసర్పంచ్ రాము, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, తిరుపతి ఉన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని వ్యక్తికి గాయాలు

గజ్వేల్‌రూరల్: రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని జాలిగామ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చిట్యాల కర్ణాకర్ గజ్వేల్‌లోని ఓ వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. దినచర్యలో భాగంగా ఈనెల 14న వాటర్‌ప్లాంట్‌లో పనిముగించుకొని రాత్రి సమయంలో తన ద్విచక్ర వాహనంపై గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలోని పత్తిమిల్లు వద్ద రోడ్డుపై పలువురు రైతులు ఆరబోసిన వరి ధాన్యంను కుప్పలుగా చేసి వాటిపై నల్ల కవర్‌ను కప్పి రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న వడ్లకుప్పను ఢీకొని గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీకి తీసుకెళ్లారు. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటలాడేటోళ్లం.. అల్లరి చేసేటోళ్లం

ఎన్నో మధురస్మృతులు.. ఎన్నెన్నో బాల్యపు జ్ఞాపకాలు



మాట్లాడుతున్న సిధారెడ్డి

సమ్మర్ స్పెషల్

- వేసవి సెలవులు వచ్చాయంటే రెండు నెలలు పండుగే
- నాడు బావిలో పడిపోతే బాల్యమిత్రుడు పోచయ్య కాపాడిండు
- 'సాక్షి'తో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి

సాక్షి, సిద్దిపేట: 'బాల్యపు జ్ఞాపకాలు నేటికీ మధురస్మృతులు.. వేసవి సెలవులు వచ్చాయంటే మాకు పండుగే.. ఆటలు ఆడేటోళ్లం.. అల్లరి చేసేటోళ్లం.. వేసవి సెలవులొస్తే దాదాపు రెండు నెలలు స్నేహితులతో సరదాగా గడిపే వాళ్లం' అని రచయిత, ఉద్యమకారుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. సిధారెడ్డి తన బాల్యంలోని వేసవి జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే.. సిద్దిపేట మండలం బంధారం గ్రామం మాది. మా ఊరులో పాఠశాల లేకపోతే వెల్కటూరుకు వెళ్లే వాళ్లం. వెల్కటూరు ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సమయంలో దాహం వేస్తే మేము బావుల దగ్గరికి, ఎవరి ఇంటికైనా వెళ్లి నీళ్లు తాగి వచ్చే వాళ్లం. ఒక రోజు నాకు బాగా దాహం వేయడంతో బావి దగ్గరికి వెళ్లాను. దరి తెలియకపోవడంతో జారి బావిలో పడిపోయాను. అప్పుడు నాకు ఈత రాదు, నేను చనిపోయాను అనుకున్నా.. నన్ను వెతుక్కుంటూ నా బాల్య మిత్రుడు పోచయ్య వచ్చాడు. వెంటనే నన్ను చూసి బావిలోకి దూకి కాపాడారు. అప్పుడు పోచయ్య నన్ను కాపాడకపోతే నేను బతికేవాడిని కాదు. అలా నాకు పోచయ్య ప్రాణదాత అయ్యాడు. ఇది నా జీవితంలో మరచిపోని సంఘటన.

దొంగచాటుగా మామిడి కాయలు తెంపుకునేటోళ్లం

మేము దాదాపు 10 మంది కలిసి వెళ్లే వాళ్లం. ఓ ఇద్దరు అక్కడ కాపాలా ఉండే వారితో ముచ్చట పెడుతుంటే మరికొందరు తోటలోకి వెళ్లి మామిడి కాయలు, అల్లనేరేడు పండ్లు తెంపుకొచ్చేవాళ్లు. అప్పుడు ఫోన్‌లు సైతం సరిగా లేవు. మా ఊరు బంధారానికి కరెంటే లేదు. ఇప్పుడు చిన్న పిల్లలందరూ ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్‌లు ఇవ్వకుండా పర్యాటక ప్రాంతాలు చూపించాలి. ఫిజికల్ యాక్టివిటీస్ చేపించాలి. మంచి పుస్తకాలు చదువుకునే విధంగా ప్రోత్సహించాలి.



స్నేహితులే ఈత నేర్పారు..

పరీక్షలు అయిపోయి.. రిజల్ట్ తీసుకోగానే వేసవి సెలవులు దాదాపు రెండు నెలలు ఎంజాయ్ చేసేవాళ్లం. 6వ తరగతిలో జరిగిన సంఘటనతో నాకు స్నేహితులు ఈత నేరిపించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈత కొట్టేవాళ్లం. ప్రతి రోజు ఉదయం పూట నేను వడ్ల సత్తయ్య, మధుసూదన్, పోచయ్య, బాల్‌నర్సయ్య, అంజిరెడ్డి, ఆగంరెడ్డి ఇలా దాదాపు 10 మంది కలిసి ఈతకు వెళ్లాం. తిండి తిప్పలు మానేసి ఈత కొట్టాం. బావిలో ముట్టించుకునే ఆటలు ఆడేటోళ్లం. ఇంటికిపోయే సమయంలో ఎండకు కాళ్లు కాలుతుంటే మోదుగు ఆకులు, సీతాఫలం కొమ్మలతో కలిపి చెప్పులాగా కుట్టుకొని రక్షణ పొందాం. సాయంత్రం చీర్రగోనే, తాటి ముంజలతో బండి, చింతగింజల ఆట, గోటీలు ఆడేటోళ్లం.

కానిస్టేబుల్ దాడి చేశాడంటూ ఆందోళన

ఎక్సైజ్ ఆఫీస్ ఎదుట హనుమాన్ మాలధారుల ధర్నా



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హనుమాన్ మాలధారులు, బీజేపీ నాయకులు

హుస్నాబాద్: హనుమాన్ మాల ధరించిన భక్తుడిపై ఎక్సైజ్ కానిస్టేబుల్ దాడి చేశారంటూ శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మాలధారులు ధర్నా చేశారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ మాల ధరించిన శివప్రసాద్ పట్టణంలోని ఓ వైన్స్ షాపునకు సంబంధించిన సిట్టింగ్ పర్మిట్ రూంలో పని చేస్తున్నాడని తెలిపారు. అయితే మద్యం తాగేందుకు ఎక్సైజ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి పర్మిట్ రూంకు వచ్చాడు. గ్లాసులు కావాలని కోరగా, శివప్రసాద్ గ్లాస్‌లు ఇచ్చి డబ్బులు అడిగాడు. నేను ఎవరో తెలుసా, డబ్బులు అడుగుతావా.. వైన్స్ షాపును సీజ్ చేయిస్తానని బెదిరించి శివ ప్రసాద్‌పై దాడి చేశాడని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మాలధారులు ధర్నా నిర్వహించి కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ సీఐ మహేష్ వచ్చి కానిస్టేబుల్ పై చర్యలు తీసుకుంటానని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్ బాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, మాలధారులు ఉన్నారు.

ఏపీ ఈసెట్‌లో సత్తా చాటిన విద్యార్థినులు



విద్యార్థినులను సన్మానిస్తున్న గ్రామస్తులు

స్టేట్ ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సొంతం

మిరుదొడ్డి(దుబ్బాక): ఏపీ ఈసెట్ ఫలితాల్లో ఒకే మండలం ఒకే గ్రామానికి చెందిన విద్యార్థినులు ప్రభంజనం సృష్టించారు. ఇటీవల విడుదలైన రాష్ట్ర స్థాయి ఫలితాల్లో మొదటి, రెండవ ర్యాంకులను సాధించి ఔరా అనిపించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట -భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కట్ల యాదగిరి, కవిత దంపతుల కూతురు రేవతి, అలాగే పంజ నర్సింలు, చెన్నవ్వల కూతురు నవ్య ఏపీ ఈసెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని ఈసీఈ విభాగంలో మొదటి, రెండో ర్యాంకులు సాధించి జిల్లాకే తలమానికంగా నిలిచారు.

కూలి కుటుంబంలో ఆణిముత్యాలు

రెక్కాడితే గాని డొక్కాడని కూలీ కుటుంబంలో జన్మించిన రేవతి, నవ్య టీఎస్ఆర్‌జేసీ ఎన్సానపల్లిలో పది వరకు చదివి గవర్నమెంట్ ఎలక్ట్రానిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ సికింద్రాబాద్‌లో డిప్లొమా పూర్తి చేశారు. రేవతి తండ్రి వ్యవసాయ కూలీ పనులు చేయగా తల్లి బీడీలు చుడుతూ తన బిడ్డను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అలాగే పంజ నర్సింలు చెన్నవ్వల కూతురు నవ్యను హమాలి, వ్యవసాయ కూలీ పనులు చేస్తూ చదివిస్తున్నారు. తల్లిదండ్రులు తమ చదువు కోసం పడుతున్న కష్టాలకు చలించి ఉన్నత చదువులే లక్ష్యంగా చదివి కలల సాకారాన్ని సాధించుకున్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల విద్యార్థిలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

చెరువు కట్టపై గొడవ

- ఇరువర్గాలపై కేసు నమోదు
- 17 మంది బైండోవర్



నిందితులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ నీరేష్

చేర్యాల(సిద్దిపేట): చెరువుకట్టపై కొట్టుకున్న కేసులో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి 17 మందిని బైండోవర్ చేశారు. ఈ ఘటన శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నీరేష్ వివరాల ప్రకారం.. ఈ నెల 13న ఓ గొడవ విషయమై ఇరు వర్గాలు మాట్లాడుకుందామని పట్టణ కేంద్రంలోని చెరువుకట్ట మీదికి వచ్చారు. ఈ క్రమంలో ఓ వర్గంలోని వ్యక్తి మరో వర్గం వారిపై దాడి చేశాడు. బాధిత వర్గం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా దాడికి పాల్పడిన వ్యక్తి వర్గానికి సంబంధించిన 17 మందిని శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



సుశీలమ్మ

పటాన్‌చెరు టౌన్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు సుశీలమ్మ (86) ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కరికి రూ.1,500, మరో ఆరుగురికి రూ. వెయ్యి, అదేవిధంగా మరో ఆరుగురికి రూ. 500, ఇద్దరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు.

కారు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన ఈరమ్మ

రాయికోడ్ (అందోల్): నీళ్లు తాగేందుకు బైక్ ఆపగా వెనకనుంచి వేగంగా వచ్చిన కార్ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని యూసుఫ్ పూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు.. రేగోడ్ మండలం జగిర్యాల గ్రామానికి చెందిన ఎస్.బస్వరాజ్ తల్లి ఈరమ్మతో కలిసి బైక్‌పై మునిపల్లి మండలం పిల్లోడి గ్రామంలో శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దాహం వేయగా యూసుఫ్ పూర్ గ్రామ శివారులో బైక్ ఆపి మంచి నీళ్లు తాగుతున్న సమయంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన ఎర్టిగా కార్ బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో ఈరమ్మ తలకు బలమైన గాయాలయ్యాయి. జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరుడు వీరశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ

- బడీడు పిల్లలంతా బడిలో చేరాలి
- స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మదన్ మోహన్

మెదక్ కలెక్టరేట్ : ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను రిసోర్స్‌పర్సన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే బడి బయట ఉన్న పిల్లలను బడిబాటలో భాగంగా పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందించాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం పోషకుల సమావేశం నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి



వాకర్స్ ఆధ్వర్యంలో వినూత్నరీతిలో ఏర్పాటు చేసిన సందేశాత్మక గోడ

సిద్దిపేటజోన్: దేశ సరిహద్దు రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని సిద్దిపేట మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. శుక్రవారం స్థానిక కోమటిచెరువు నెక్లెస్ రోడ్ వద్ద వినూత్నంగా గ్రాటీట్యూట్ వాల్(సందేశాత్మక గోడ) ఏర్పాటు చేశారు. భారత్, పాకిస్తాన్ మధ్య ఇటీవల జరిగిన యుద్ధం నేపథ్యంలో మన దేశం, మన సైనికులపై ఉన్న అభిమానాన్ని గోడ మీద ఉన్న వస్త్రంపై అతికించారు. టూటౌన్ సీఐ ఉపేందర్ సైతం తన కుటుంబ సభ్యులతో కలిసి సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్ కుమార్, శ్రీనాథ్,శివకుమార్, కిరణ్, గణేష్, సతీష్, రమేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారుతుందని, ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య అన్నారు. సిద్దిపేట జిల్లాలో వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం డీఈవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన సమస్యల పట్ల పోరాటం చేస్తూనే బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించాలనే తపన, విద్యార్థుల నిరంతర అభివృద్ధికి వారు చేసే కృషి అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు బహుముఖ పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య అందివాలని, పిల్లల నమోదు పెంచాలని ప్రయత్నం చేస్తోందని, దానికి ప్రతి ఉపాధ్యాయుడు తన వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల సాధనకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, తిరుపతి, శ్రీనాకర్ రెడ్డి, సింగోజి జనార్దన్, నర్సిరెడ్డి , బాలకిషన్, ఉమాశంకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాటారు.. నరికారు

ఆకుపచ్చని పల్లెలను సృష్టించాలని గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో ప్రతి ఏటా వేల సంఖ్యలో మొక్కలు నాటించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవంతో దానిని కొనసాగిస్తోంది. అలాగే మొక్కలు నాటేందుకు గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేసి ఉపాధి హామీ పథకంలో భాగంగా విత్తనాలు సేకరించి మొక్కలు పెంచుతున్నారు. కానీ కొంతమంది అధికారులు మాత్రం ఏపుగా పెరిగిన చెట్లను విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని నరికేస్తున్నారు. గుట్టలు తవ్వడంతో అక్కడ ఉన్న చెట్లు సైతం ధ్వంసమవుతున్నాయని ప్రకృతి ప్రేమికులు భగ్గుమంటున్నారు.

- హరితహారంలో నాటిన మొక్కలకు గండం
- విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని నరికేస్తున్నారు
- తైదల గుట్టపై మట్టి తవ్వకాలు..
- ధ్వంసమైన 6వేల టేకు చెట్లు
- భగ్గుమంటున్న ప్రకృతి ప్రేమికులు

హుస్నాబాద్ రూరల్: మండలంలోని నాగారం తైదలగుట్ట, ఉమ్మాపూర్ ఊరు ఏనల సమీపంలోనే ఆయా గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. అడవి సమీప గ్రామాలు కావడంతో నాగారం, ఉమ్మాపూర్, పోతారం(ఎస్) గ్రామాల ప్రజలు గుట్టలపై ఎక్కువగా మొక్కలు నాటారు. నాగారం ప్రభుత్వ భూమిలోని సర్వే నం.54లోని గుట్టపై 10 వేల టేకు మొక్కలను విడుతల వారీగా నాటారు. గుట్టలకు మట్టి తీయడంతో 6 వేల పైచిలుకు టేకు చెట్లు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విలువైన మొక్కలు ఉన్నాయని, మట్టి తీయద్దని గ్రామస్తులు అడ్డుపడితే.. ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చి తప్పుకున్నారు. ఇక్కడి మట్టిని హన్మకొండ జిల్లాలోని నేషనల్ హైవే రోడ్డు పనులకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపించారు. ఉమ్మాపూర్ అటవీ ప్రాంతానికి వెళ్లే దారిలో నాగారం, పోతారం(ఎస్) మధ్య ఉన్న బైరాన్ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. పక్కనే ఉన్న తైదల గుట్ట నుంచి వైకుంఠధామం, నర్సరీ వరకు మట్టి తవ్వకాలు జరపడంతో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



అక్కన్నపేట రోడ్డులో చెట్లను నరికిన దృశ్యం



నాగారం వైకుంఠధామం, నర్సరీ హద్దుల వరకు జరిపిన మట్టి తవ్వకాలు

విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని..

గ్రామాల రోడ్లు పచ్చదనంతో ఉండాలని అవెన్యూ ప్లాంటేషన్ కింద అధికారులు మొక్కలు నాటిస్తే అవి వృక్షాలై బాటసారులకు నీడను అందిస్తున్నాయి. వానాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. నరికిన చెట్ల కొమ్మలను రోడ్డుపై వేయడంతో ఆర్టీసీ బస్సుల అద్దాలకు గీసుకొని గీతలు పడి ధ్వంసమవుతున్నాయని డ్రైవర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

10వేల మొక్కలు నాటాం



ఉమ్మాపూర్, నాగారం గుట్టలకు 10వేల మొక్కలు నాటాం. పల్లెల్లో పచ్చదనం పెరగాలని అటవీ ప్రాంత గ్రామాల్లో ఎక్కువ మొక్కలు నాటించాం. నాటిన ప్రతి మొక్కనూ కూలీలు, వన సంరక్షకులు నీళ్లు పోసి పెంచారు. టేకు వృక్షాలైతే గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తుందని ఎక్కువ మొక్కలు నాటించాం. కానీ గుట్టపై మట్టి తీయడంతో ఆ మొక్కలు ధ్వంసమయ్యాయి.

– పద్మ, ఏపీఓ ,హుస్నాబాద్

అనుమతులతోనే తరలించారు



నేషనల్ హైవే రోడ్డు పనుల కోసం మైనింగ్ అనుమతులు తీసుకొని మట్టి తవ్వకాలు జరిపారు. అనుమతులకు మించి మట్టి తవ్వకాలు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు నాగారం గుట్టపై మట్టి తవ్వకాలను నిలిపివేశాం.

– రవీందర్ రెడ్డి, తహసీల్దార్, హుస్నాబాద్